ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 31 మార్చి 2025



## ప్రతీ పేద కుటుంబానికి సన్నబియ్యం



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పేద వారి కడుపునింపడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్టు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఆదివారం రామగుండం నగరపాలక సంస్థ 43వ డివిజన్ పరిధిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం పం పిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, తాము ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించడంతోపాటు కొత్త రేషన్‌కార్డులు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో 3కోట్ల పది లక్షల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రామగుండంలో ప్రస్తుతం ఇస్తున్న 89వేల క్వింటాళ్ల సన్నబియ్యంతో పాటు మరో పదివేల కొత్త రేషన్‌కార్డులకు కూడా బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. తహసీల్దార్ కుమారస్వామి, రేషన్ డీలర్ నంబయ్య, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్, నాయకులు మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, గట్ల రమేష్, పెద్దెల్లి ప్రకాష్, పాల్గొన్నారు.

## వైభవంగా ఉగాది వేడుకలు

- ఆలయాల్లో భక్తుల పూజలు
- పండితుల పంచాంగ శ్రవణాలు
- ఎడ్లబండ్ల ప్రదర్శనలు, బోనాలు
- పోచమ్మకు మొక్కులు



సుల్తానాబాద్ వేణుగోపాలస్వామి ఆలయంలో పంచాంగ పఠనం

విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు... ఉదయం నుంచే ప్రజలు ఆలయాలకు క్యూ కట్టారు... ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు... పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు.. ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు.. షడ్రుచుల ఉగాది పచ్చడి, భక్షాలను ఆరగించారు.. పలు ఆలయాల్లో ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు.. రైతులు వ్యవసాయ పనిముట్లకు పూజలు చేశారు.. పర్వతాల మల్లికార్జున స్వామి ఆలయానికి మహిళలు బోనంతో వెళ్ళి మొక్కులు చెల్లించుకున్నారు...



పెద్దకల్వలలో బోనాలతో మహిళల ఊరేగింపు





పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల్లో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్

## బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు



రాజేష్ థియేటర్ చౌరస్తాలో చెట్టు కింద నిలబడ్డ ప్రయాణికులు

కళ్యాణ్‌నగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్టీసీ డిపో పరిధిలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూపాలపల్లి, మంథని, పరకాల, భద్రాచలం, ఓడెడ్, బేగంపేట రూట్లలో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. బస్సులు వచ్చే వరకు చెట్ల కిందనే నిలబడాల్సిన పరిస్థితి వస్తుంది. రాజేష్ థియేటర్, ప్రధాన చౌరస్తా, ఫైవింక్లయిన్‌చౌరస్తా, 2ఇంక్లైన్ చౌరస్తాలో ప్రయాణికుల కోసం కనీసంగా బస్ షెల్టర్ల ఏర్పాటు చేయకపోవడంతో చెట్ల కిందనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొన్నది. అసలే ఎండా కాలం కావడంతో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

## పాలిటెక్నిక్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఫైవింక్లయిన్‌కాలనీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీరాంపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ విభాగాల్లో కోర్సులను ఆఫర్ చేస్తున్నట్టు జీఎం తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ కోర్సుల్లో సీటు పొందవచ్చని తెలిపారు. పాలిసెట్‌కు ఏప్రిల్ 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జీఎం సూచించారు. మే 13న పాలిసెట్ పరీక్ష, జూన్‌లో ఫలితాలు వస్తాయని జీఎం పేర్కొన్నారు. శ్రీరాంపూర్ పాలిటెక్నిక్ కాలేజీలో 50 శాతం సీట్లు ఓపెన్ కోటాలో 50 శాతం సీట్లు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కేటాయిస్తారని తెలిపారు. నాణ్యమైన పాలిటెక్నిక్ కోర్సులు నిర్వహిస్తున్న సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో సీట్లు సాధించేలా ఉద్యోగుల పిల్లలు, పరిసర ప్రాంతాల విద్యార్థులు పాలిసెట్‌కు సిద్ధం కావాలని జీఎం వెంకటయ్య సూచించారు.

## గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఖని కళాకారిణి

మార్కండేయకాలనీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్యంలో విద్యార్థులకు శిక్షణనందిస్తున్న గోదావరిఖనికి చెందిన గుమ్మడి ఉజ్వలను ఉగాది ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ విష్ణుదేవ్ వర్మ అవార్డును అందజేశారు. ఉజ్వల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కూచిపూడిలో గోల్డ్ మెడల్ సాధించింది. అనేక పాఠశాలల్లో విద్యార్థులకు కూచిపూడిలో శిక్షణనిస్తున్న ఉజ్వలకు పలువురు హర్షం వ్యక్తం చేశారు.



గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఉజ్వల

## నేడు రంజాన్

- ప్రార్థనలకు సిద్ధమైన ముస్లింలు
- ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

పెద్దపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉపవాస దీక్షలు, జకాత్, ఫిత్రా వంటి దానధర్మాలకు ప్రతీకగా భావించే ఈదుల్ ఫితర్ (రంజాన్)ను సోమవారం ముస్లింలు జరుపుకోనున్నారు. ఆదివారం రాత్రి నమాజు అనంతరం నెలవంక దర్శనమిచ్చింది. నెల రోజుల దీక్ష ముగించి సోమవారం సామూహిక నమాజ్ అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. మాసమంతా ఖురాన్ పఠనంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు చిన్నా పెద్దా తేడా లేకుండా అల్లాహ్‌పై తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

### మార్కెట్‌లో సందడి

రంజాన్ వస్తువుల కొనుగోళ్లతో రెండు, మూడు రోజుల నుంచి మార్కెట్ సందడిగా మారింది. ముస్లింలు షాపింగ్ చేస్తూ బిజీగా గడుపుతున్నారు. వస్త్ర, వ్యాపార సముదాయాలు రద్దీగా మారాయి. దుస్తులు, టోపీలు, అత్తర్లు, స్ప్రేలు, స్వీట్లు, సేమియాలు, గాజులు, సుర్మా, మెహందీ, అలంకరణ సామగ్రి కొనుగోలు చేశారు.

### నెలవంక దర్శనంతో సందడి

నెలవంక దర్శనమిచ్చింది. మసీదులు, ముస్లింల గృహాల్లో సందడి నెలకొంది. ఆదివారం రాత్రి నమాజుల అనంతరం నెలవంక కనిపించడంతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసం ముగింపు సూచకంగా భావించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలింగనాలు చేసుకున్నారు.

### ఈద్గాల్లో ఏర్పాట్లు

రంజాన్ సందర్భంగా పలు ఈద్గాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం సామూహిక ప్రార్థల దృష్ట్యా మున్సిపల్, పోలీసు, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. షామియానాలు, టెంట్లు, కార్పెట్లు, సౌండ్ సిస్టంలు, తాగునీటి సౌకర్యం కల్పించారు.

## కొత్త పింఛన్లు ఇచ్చేదెప్పుడో?

- వృద్ధులు చనిపోతే కుటుంబంలో ఒకరికి పింఛన్
- ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం
- వలస వెళ్లిన వారి గురించి ఆరా..
- కొత్త పింఛన్ల కోసం అనేక మంది నిరీక్షణ



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

చేయూత పథకంపై ఆశలు పెంచుకున్న ఆశావహుల ఆశలు ఇప్పట్లో నెరవేరేలా కనబడడం లేదు. వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి ఆయా కుటుంబాల్లో పింఛన్ పొందుతున్న వృద్ధులు చనిపోతే, ఆ కుటుంబంలో అర్హత గల వారికి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఇప్పటి వరకు మరణించిన వృద్ధుల వివరాలను సేకరించే పనిలో సెర్ప్ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత, గీత కార్మి కులు, తదితర వర్గాలకు చెందిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్ పథకాన్ని కొనసాగిస్తున్నాయి.

### ● జిల్లాలో పింఛన్లు ఇలా..

జిల్లాలో వృద్ధాప్య 40,884 మంది, వితంతు 32,903 మంది, దివ్యాంగులు 13,068 మంది, చేనేత 806 మంది, గీత కార్మికులు 2187 మంది, బీడీ కార్మికులు 695 మంది, ఒంటరి మహిళలు 2,613 మంది, టేకేదార్‌లు ఐదుగురు, ఫైలేరియా బాధితులు 338 మంది, డయాలిసిస్ బాధితులు 83 మంది, ఇతరులు 1253 మంది, మొత్తం 94,835 మందికి పింఛన్లు ఇస్తున్నారు. ఈ పథకం కింద దివ్యాంగులకు నెలకు 3,016 రూపాయలు, ఇతరులకు 2,016 ఇస్తున్నారు.

### ● పదిహేను నెలలుగా కొత్త పింఛన్ల ఊసే లేదు..

తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆ గ్యారంటీ పథకాల్లో ఒకటైన చేయూత పథకం కింద పింఛన్ల సొమ్మును డబుల్ చేయడంతో పాటు కొత్తగా అర్హులైన వారం దరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, పట్టణ సభల ద్వారా ఆరు గ్యారం టీ పథకాల కింద ప్రజల నుంచి ప్రభుత్వం దరఖా స్తులను స్వీకరించింది. అందులో భాగంగా చేయూత పథకం కింద దివ్యాంగుల పింఛన్ కోసం 6.979 మంది, ఇతరులు 49,552 మంది, మొత్తం 56, 531 మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పదిహేను నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. ఉన్న పింఛన్‌దారుల్లో దివ్యాం గులకు నెలకు 6 వేలు, ఇతరులకు 4 వేల రూపాయలు ఇస్తా మన్న ప్రభుత్వం అమలు చేయలేదు. కొత్త పింఛన్ల కోసం అనేక మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికా రుల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వ హయాం లో ఐదేళ్లలో 2022లో ఒకసారి మాత్రమే జిల్లాలో కొత్త వారికి పింఛన్లు మంజూరు చేశారు. అప్పటి నుంచి కొత్త పింఛన్లు ఇచ్చిన దాఖలాలు కనబడడం లేదు. పింఛన్ల మంజూరు విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలది ఒకే వైఖరిగా కనబడుతున్నదనే విమర్శలు వస్తున్నాయి.

### ● వృద్ధులు మరణిస్తేనే మరొకరికి పింఛన్..

తాజాగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖాధికారులు వృద్ధాప్య పింఛన్‌దారులు మరణిస్తే, వారి కుటుంబంలో భార్యకు గానీ, భర్తకు గానీ లేదా అర్హులైన ఇతరులకు వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించింది. దీంతో మరణించిన వృద్ధుల వివరాలను, వారి కుటుంబంలో అర్హులైన వారి వివరాలను క్షేత్ర స్థాయిలో సేకరించాలని డీఆర్‌డీ అధికారి సెర్ప్ సిబ్బందిని ఆదేశించారు. పోస్టాఫీసుల ద్వారా పింఛన్లు పొందుతున్న వారిలో రాష్ట్ర వ్యాప్తంగా 2,55,262 మంది మూడు మాసాలపాటు పింఛన్ తీసుకుని ఆ తర్వాత వలస వెళ్లారని గుర్తించారు. అందులో జిల్లాలో 611 మంది ఉన్నారు. ఇందులో ఎవరైనా మరణించారా, ఏపీ ప్రాంతాలకు వలస వెళ్లారు, తిరిగి ఎప్పుడు వస్తారనే విషయమై ఆరా తీస్తున్నారు. కొత్త పింఛన్ల మంజూరు కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. మరణించిన వృద్ధుల కుటుంబాల్లో మరొకరికి అర్హులైన మంజూరు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఇప్పట్లో ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయడం, ఉన్న పింఛన్ దారులకు సొమ్ము పెంచే అవకాశాలు కనిపించడం లేదు.

## మహాత్మాజ్యోతిబాపూలే గురుకులం ఎదుట తల్లిదండ్రుల పడిగాపులు

- పండుగ పూట పిల్లలను కలిసేందుకు రాక



గురుకుల పాఠశాల ఎదుట ఉన్న తల్లిదండ్రులు

కోల్‌సిటీటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ పూట పిల్లలను కలిసేందుకు తల్లిదండ్రులు పడిగాపులు కాశారు. స్థానిక రమేష్ నగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల(గుంజపడుగు) వద్ద ఆదివారం పిల్లలను కలిసేందుకు తల్లిదండ్రులు వచ్చారు. పండుగకు పిల్లలను ఇంటికి పంపించే పరిస్థితి లేకపోవడంతో ఉగాది పండుగ పచ్చడి, బక్షాలు పిండివంటలు తీసుకొని పిల్లలకు తినిపించేందుకు తల్లిదండ్రులకు నిబంధనలు అడ్డువచ్చాయి. గురుకుల పాఠశాల బయట ఉన్న తల్లిదండ్రులు, వసతిగృహంలో ఉన్న పిల్లలు నిరీక్షిస్తూ కంటతడిపెట్టారు. వసతి గృహంలోని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో సంప్రదించినా నిబంధనలున్నాయని, అనుమతించ వద్దని చెప్పడంతో గంటల తరబడి గురుకుల పాఠశాల ఎదుట తల్లిదండ్రులు వేచి ఉన్నారు. చివరికి పిల్లలను కలిసేందుకు అనుమతించడంతో సంతోషంగా వారిని కలిసి అప్యాయంగా పిండివంటలు తినిపించారు.

## ధర్మారం, ఓదెలలో జోరుగా మట్టి తవ్వకాలు

- అర్ధరాత్రి తరువాత టిప్పర్లలో మట్టి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న మట్టి మాఫియా
- మట్టి తీసే క్రమంలో చెట్లను తొలగింపు
- పట్టించుకోని అధికారులు



ధర్మారం శివారులో మట్టి తీసిన ప్రదేశం

ధర్మారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ధర్మారంలో మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అర్ధరాత్రి నుంచి మొదలుకొని తెల్లవారుజాము వరకు భారీ టిప్పర్లతో మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టి తీయాలంటే ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి కలెక్టర్ కోయ శ్రీహర్ష గృహ అవసరాల కోసం నూతన మట్టి పాలసీని గత నెలలో ప్రవేశపెట్టారు. ఈ పాలసీ ప్రకారం గృహ అవసరాలకు మట్టిని తీసుకునే వారు ట్రాక్టర్‌కు రూ.2 వందలు, టిప్పర్‌కు రూ.8 వందలు కలెక్టర్ పెద్దపల్లి, తహసీల్దార్‌కు డీడీ తీయాల్సి ఉంటుంది. ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వానికి రుసుం చెల్లించినా కేవలం పని దినాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే మట్టి తరలించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పట్టించుకోకుండా మట్టి మాఫియా అర్ధరాత్రి అక్రమంగా మట్టి తరలిస్తోంది. మట్టి తొలగిస్తున్న క్రమంలో అడ్డువచ్చిన చెట్లను తొలగిస్తూ పచ్చదనానికి తూట్లు పొడుస్తున్నారు.

### ● పట్టించుకోని అధికారులు

కొన్ని నెలలుగా అక్రమంగా మట్టి దందా జోరుగా కొనసాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెలవు రోజుల్లో అధికారాలు లేని సమయాల్లో మట్టి మాఫియా చెలరేగిపోతుంది. పర్యవేక్షించాల్సిన మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి తీసే సమయంలో చెట్లను తొలగిస్తున్నా అధికారులు ఎవ్వరు పట్టించుకోవడం లేదు. ఇందుకోసం ఫోన్‌లో మైనింగ్ అధికారులను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

### అనుమతి తీసుకోలేదు

**ఎం.డీ వఖీల్, తహసీల్దార్**

గృహ అవసరాల కోసం దాదాపు వంద ట్రాక్టర్ల వరకు అనుమతి తీసుకున్నారు. టిప్పర్లలో మట్టి తరలింపు కోసం ఎవ్వరు అనుమతి తీసుకోలేదు. ప్రభుత్వానికి రుసుము చెల్లించకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

### మానేరు వాగులో మట్టి తవ్వకాలు

ఓదెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రూపునారాయణపేట శివారులోని మానేరు వాగులో రెండు రోజుల నుంచి కొందరు వ్యక్తులు జోరుగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఇన్నాళ్లుగా ఇసుకను తోడేయగా ఇప్పుడు మట్టిని వదలడం లేదు. ఇసుక కింద ఉన్న మట్టిని తవ్వకెళ్లి గొయ్యిలలో నింపుతున్న తీరు ఇక్కడి మానేరు వాగులో నయా దందాకు తెరలేపారు. ముందుగా టిప్పర్లు రాకపోకలు సాగించే విధంగా వాగులోని అనువైన ప్రాంతాన్ని చూసి ఇసుకను తవ్వి కుప్పలుగా పోస్తున్నారు. అడుగు బాగం నుంచి మట్టిని తవ్వి అమ్ముకుంటున్నారు. మట్టి తవ్వకాలను చేపట్టేందుకు మానేరులో మట్టితో రోడ్డు కూడా వేశారు. రెండు రోజుల నుంచి మట్టి దందా కొనసాగుతున్నప్పటికీ ఏ అధికారి కూడా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై, అక్రమ దారుల్లో మట్టి తవ్వకాలను చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మట్టిని తరలిస్తున్న టిప్పర్

## ఆటో-ద్విచక్రవాహనం ఢీ

● యువకుడు మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని హన్మంతునిపేట గ్రామశివారులో శనివారం సాయంత్రం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. హన్మంతునిపేట గ్రామానికిచెందిన అజయ్ (23) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. గ్రామంలో చిరుతల రామాయణంలో చురుకుగా పాల్గొని తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాదం నెలకొంది.

## గల్లంతైన చిన్నారి మృతదేహం లభ్యం

రామగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల శివారులోని ఇటుక బట్టీలో ఒడిశారాష్ట్రానికి చెందిన గెల్వి(2) అనే చిన్నారి మృతదేహం ఆదివారం లభ్యమైంది. శనివారం సాయంత్రం ఎస్ఆర్ఎస్పి, ఎల్ఎస్‌బి కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి గల్లంతైంది. కెనాల్‌లో నీటి సరఫరాను నిలిపివేసి శనివారం నుంచి గాలింపులు చేపట్టగా ఆదివారం ప్రమాదానికి నీట మునిగిన ప్రాంతం నుంచి 7వందల మీటర్ల దూరంలో చిన్నారి మృతదేహం నీటిపై తేలిందని ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నారి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఓదెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం బుద్దె కుమారస్వామి అనే రైతుకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందింది. సాయంత్రం మొక్కజొన్నపంట సమీపంలో గడ్డి మేస్తున్న సమయంలో కిందికు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ ఎద్దుకు తాకడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు మృతితో రూ.50వేల మేరకు ఆర్థికనష్టం వాటిల్లిందని రైతు కుమారస్వామి తెలిపారు. ప్రమాదప్రాంతానికి విద్యుత్ అధికారులు సందర్శించి పరిశీలించారు.

## అభ్యంతరకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని పలు వాట్సాప్ గ్రూపుల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టిన రామచంద్రపూర్ గ్రామానికి చెందిన బొద్దు శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తనను కించపరిచేవిధంగా బొద్దుశ్రీధర్ పోస్టులు పెట్టాడని చిన్న లింగపూర్ గ్రామానికి చెందిన భైరినేని రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం నిందితునివద్ద నుంచి మొబైల్‌ఫోన్ స్వాధీన పర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా, వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఏఎంసీ కార్యదర్శి, సెక్యూరిటీగార్డుల రిమాండ్

కరీంనగర్ క్రైం, మార్చి 30(ఆంధ్ర జ్యోతి): కరీంనగర్‌లో పండ్ల వ్యాపారుల నుంచి 60వేల రూపాయలు లంచం తీసుకుంటూ శనివారం ఏసీబీకి చిక్కిన కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎ పురుషోత్తం, సెక్యూరిటీగార్డు శ్రీనివాస్ రెడ్డిని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఇదరిని అదుపులోకి తీసుకున్న కరీంనగర్ ఏసీబీ పోలీసులు విచారణ అనంతరం ఆదివారం కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో కరీంనగర్ జిల్లా జైలుకు 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందని ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు.

# ఈత సరదా.. కారాదు విషాదం..

- వేసవిలో చెరువులు, కాలువల వద్ద పొంచి ఉన్న ప్రమాదాలు
- పిల్లలను జాగ్రత్తగా గమనించాలని నిపుణుల సూచన



జగిత్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఈత కొలనుల్లో, చెరువులు, కుంటల్లో ఈత కొట్టడం చాలా మంది పిల్లలకు సరదాగా ఉంటుంది. కానీ తగు జాగ్రత్తలు పాటించక పోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రధానంగా ఎస్సారెస్పీ కాకతీయ కాలువ, వరద కాలువ అనుబంధ కాలువల్లో పిల్లలు ఈత కొడుతుంటారు. అజాగ్రత్తగా వ్యవహరిస్తే ఈతకు వెళ్లిన వారు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం ఉన్నాయి.



### ● జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటన

గొల్లపల్లి మండలం రంగదాముపల్లె రిజర్వాయర్‌లో కొద్ది రోజుల క్రితం ఈతకు వెళ్లి ఎనిమిదో తరగతి బాలుడు నేరెళ్ల నరేష్(12) మృతిచెందాడు. ఒంటిపూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి రిజర్వాయర్‌లోకి ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా నరేష్‌కు ఈత రాకపోవడంతో మరోచోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు. కాసేపటికి అందులో మునిగి మృతిచెందాడు.

### ● తల్లిదండ్రులూ..తస్మాత్ జాగ్రత్త

ఈత రాని పిల్లలను తల్లిదండ్రులు ఒంటరిగా పంపకూడదు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు తప్పకుండా వెళ్లాలి. ఎంత లోతుకు వెళ్లి ఈత కొట్టాలో ముందే జాగ్రత్తగా చెప్పాలి. పిల్లలు చెరువులు, కుంటలు, కాలువలు, స్విమ్మింగ్‌పూల్స్‌లో ఈత కొడుతున్నంత సేపు పెద్దలు జాగ్రత్తగా గమనించాలి. ఈత నేర్చుకునేటప్పుడు లైఫ్ జాకెట్లు ధరించేలా చూడాలి. నిపుణల పర్యవేక్షణలో ఈతను నేర్పాలి. చెరువుల్లో చేపల కొరకు వేసిన వలలు ఉంటాయి. వాటిల్లో చిక్కుకునే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలి. చెరువుల్లో బురద అధికంగా ఉన్న ప్రాంతాల్లో కాళ్లు పూడుకపోయి పైకి వచ్చే పరిస్థితి ఉండదు. కాలువల్లో నీటి ప్రవాహ వేగం అంచనా వేయకపోతే ప్రమాదాలు చోటుచేసుకుంటాయి.

### ● ప్రమాదాలు జరిగితే..

చెరువులు, కుంటలు, కాలువల్లో పడి చిక్కుకుపోయిన వారిని బయటకు తీయగానే వెల్లకిలా పడుకోబెట్టాలి. పొట్టపై మెల్లిగా నొక్కి, నీటిని బయటకు తీయాలి. బాధితుడికి శ్వాస ఆడకపోతే తోటి వ్యక్తులు నోటి ద్వారా శ్వాస అందించాలి. గుండె కొట్టుకోకుంటే చాతిపై నొక్కాలి. వీలైనంత త్వరగా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

## కుటుంబాన్ని బెదిరించిన వ్యక్తిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇంట్లో చొరబడి ఓకుటుంబాన్ని బెదిరించిన కేసులో గుగు లోతు కుమార్‌నాయక్‌పై గోదావరిఖని టూటౌన్‌పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం కుమార్ నాయక్ మరో పదిమందితో కలసి హనుమాన్‌నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి ఇంట్లో చొరబడి దాడికి యత్నిం చాడు. భాగ్యలక్ష్మి కుమారుడుకి వచ్చిన సింగరేణి టెండర్‌ను వదులు కోవాలని, లేదంటే కుటుంబం మొత్తాన్ని చంపుతానంటూ బెదిరించాడు.

భాగ్యలక్ష్మిపై దుర్భాషలాడుతూ దాడికి యత్నించాడు. కుమార్ నాయక్‌తో తన కుటుంబానికి ప్రాణహాని ఉన్నదని భాగ్యలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఆదివారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు కుమార్ నాయక్‌పై కేసునమోదు చేశారు.

# గ్రూపు-1లో మెరిసిన యువత



నక్క శృతిహర్షిత, కన్నం హరిణి, పాలకుర్తి సందీప్

సుభాష్‌నగర్/కరీంనగర్ టౌన్/కరీంనగర్ క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన గ్రూపు-1 ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన యువతీ యువకులు మెరిసారు. జిల్లా కేంద్రానికి చెందిన నక్క శృతిహర్షిత జనరల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు, మల్టీజోన్ స్థాయిలో 6వర్యాంకు సాధించారు. శృతిహర్షిత అలహాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) బీటెక్ పూర్తి చేశారు. సివిల్స్‌కోసం కూడా సిద్ధమవుతున్నారు. తండ్రి బాలయ్య వైద్యఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యూకేటర్ ఆఫీసర్‌గా, తల్లి సరస్వతి కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కలెక్టర్ కావాలనేది తన లక్ష్యమని, ప్రస్తుతం తనకు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని శృతిహర్షిత పేర్కొన్నారు.

### కన్నం హరిణికి 55వ ర్యాంకు..

### - ఎస్సీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్

కరీంనగర్‌కు చెందిన కన్నం హరిణి 499.5 మార్కులతో జనరల్ కేటగిరీలో రాష్టస్థాయిలో 55వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. కరీంనగర్ ట్రినిటీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్, ఎన్ఐటీ వరంగల్‌లో ఈఈఈలో చేరి బీటెక్ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. ఐఏఎస్ కావాలనే లక్ష్యం పెట్టుకున్న హరిణి రెండేళ్లు ఉద్యోగం చేసిన తర్వాత రాజీనామా చేసి ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుంటూ సివిల్స్‌కు సిద్ధమవుతున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యారు. గ్రూప్-1 పరీక్ష రాసిన హరిణి రాష్ట్రస్థాయిలో జనరల్ కేటగిరిలో 55వ ర్యాంకు, ఎస్సీ కేటగిరిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. గ్రూప్-1 ఉద్యోగంలో చేరినా ఐఏఎస్ లక్ష్యంగా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతానని చెప్పారు. బోయినపల్లి మండలం అనంతపల్లికి చెందిన హరిణి తల్లిదండ్రులు కళాప్రపూర్ణ జ్యోతి, కన్నం రమేశ్ ఇద్దరూ స్కూల్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటున్నారు. హరిణికి ఒక అక్క, చెల్లె, తమ్ముడు ఉన్నారు. అక్క ఇప్పటికే డాక్టర్‌గా కొనసాగుతుండగా, చెల్లె ఎంబీబీఎస్ చదువుతున్నారు. తమ్ముడు డాక్టర్ లక్ష్యంగా నీట్‌కు ప్రిపేర్ అవుతున్నారు. గ్రూప్-1లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన కన్నం హరిణి, ఆమె తల్లిదండ్రులు కళాప్రపూర్ణ, రమేశ్‌ను బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చిలుక దేవశంకర్, ఉపాధ్యక్షుడు బేజగం రమేశ్, మనుపాటి రాజయ్య, మేకల స్వరూప తదితరులు అభినందించారు.

### పాలకుర్తి సందీప్‌కు 80వ ర్యాంకు..

గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన పాలకుర్తి సందీప్ రాష్ట్రస్థాయిలో 80వ ర్యాంకు సాధించారు. సందీప్ తండ్రి కాశయ్య, కరీంనగర్‌లో సీసీఎస్ ఏసీపీగా పని చేస్తున్నారు. తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. కరీంనగర్‌లోని వాణినికేతన్‌లో పదోతరగతి, ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన సందీప్ తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్, హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చేశారు. నాలుగు నెలల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో ఏవోగా విధుల్లో చేరారు. గ్రూప్-1లో 80వ ర్యాంకు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

### గ్రూపు-1లో గంభీరావుపేట ఎస్ఐకి 89 ర్యాంక్



శ్రీకాంత్

గంభీరావుపేట, మార్చి 30 (ఆంధ్ర జ్యోతి) గ్రూపు-1లో గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ రాష్ట్ర స్థాయిలో 89వ ర్యాంక్ సాధించారు. ఎస్టీ కేటగిరీలో మల్టీజోన్ పరిధిలో శ్రీకాంత్ మూడో ర్యాంక్ సాధించారు. ఎస్ఐ శ్రీకాంత్ ఓవైపు తన విధులను నిర్వహిస్తునే గ్రూపు-1 పరీక్షకు సన్నద్ధమై 489 మార్కులు సాధిం చాడు. హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్ తండాకు చెందిన శ్రీకాంత్‌ది ముందు నుంచి వ్యవసాయ కుటుంబమే.

పోతారంలో 10వ తరగతి వరకు, బాసర ట్రిబుల్ ఐటీలో బీటెక్ చేశారు. వీఆర్‌వోగా, పంచాయితీ కార్యదర్శిగా కొలువులు సాధించి, కొంతకాలం సిద్దిపేట జిల్లాలో విధులు నిర్వహించాడు. 2020లో ఎస్ఐ ఉద్యోగం సాధించి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బొయినపల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం గంభీరావుపేట ఠాణాలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ మొక్కవోని దీక్షతో చదివి గ్రూప్-1 రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంక్ సాధించాడు.

# ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి

● అస్తవ్యస్తంగా విస్తరణ పనులు ● కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు



మానకొండూర్‌లో ప్రమాదకరంగా ప్రయాణం



మానకొండూర్‌లో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



తాడికల్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన ప్యాసింజర్ ఆటో(ఫైల్)

మానకొండూర్/శంకరపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి వరంగల్ వరకు నిర్మిస్తున్న 563 జాతీయ రహదారి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో 20 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారు నుంచి వెల్లుతున్న ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వపై నిర్మించిన ఇరుకు వంతెన కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చెంజర్ల బస్టాండ్ వద్ద ఫ్లైఓవర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో నుంచి వెల్లుతున్న ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వపై నిర్మించి ఇరుకు వంతెన ప్రమాదాలకు నిలయంగామారింది. శంకరపట్నం మండలంలో ఎన్‌హెచ్-563కొత్తగట్టు శివారులో ప్రారంభమై తాడికల్‌శివారుతో ముగుస్తుంది. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలకు గురై పలువురు మృతిచెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. ఓవైపు జాతీయరహదారి విస్తరణ పనులు నడుస్తున్నాయి. ఈ పనులు అస్తవ్యస్థంగా ఉండడం, పనులు జరిగేచోట సరైన సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేషనల్‌హైవే అథారిటీ అధికారులు ఏ విధమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడం లేదనే విమర్శలు వినిపి స్తున్నాయి. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటిని ప్రమాద జోన్లుగా నిర్ధారించి కాషన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరతున్నారు.

### ● ఇటీవల జరిగిన ప్రమాదాలు

⇨ శంకరపట్నం మండలం మక్తకు చెందిన షేక్‌అజీమ్ (35), అతని కుమారుడు అబ్దుల్ రహ్మాన్ (10)లు మోటర్ సైకిల్‌పై కేశవపట్నం నుంచి మక్తకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కేశవపట్నం బస్టాండ్ సమీపంలో వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ బైక్‌ను ఎదురుగా ఢీ కొట్టడంతో తండ్రి, కొడుకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు రోడ్డు పక్కన బైక్‌పై వెళ్తున్న మాందాడి శ్రీనివాస్‌రెడ్డికి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

⇨ శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన దండు కొంరయ్య తన స్వగ్రామం నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నాడు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై మొలంగూర్ పెట్రోల్ బంకు ఎదురుగా డేనియల్ అనేవ్యక్తి కొంరయ్య బైకును వెనుకనుంచి ఢీ కొట్టాడు. దీంతో కొంరయ్య తలకు, కుడి కాలుకు గాయాలు కాగా, డేనియల్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

⇨ హనుమకొండకుచెందిన గుడిపాటి భూపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి-రమాదేవి, సునీత, మానస, సుజాత, అయాన్ష్‌తో కలిసి కారులో కరీంనగర్‌లో ఓ వివాహానికి హాజరై తిరిగి హనుమకొండకు వెళ్తున్నారు. ఈక్రమంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్, వంకాయ గూడెం గ్రామాల మధ్య కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను, ప్యాసింజర్ ఆటోను, ట్రాలీ ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇన్నోవా ప్యాసింజర్ ఆటోను బలంగా ఢీ కొట్టడంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటో డ్రైవర్ మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

⇨ హుజూరాబాద్ మండలం రాజపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ హైమద్ తన వ్యక్తిగత అవసరాల రీత్యా కేశవపట్నం వచ్చి తన స్వగ్రామం రాజపల్లికి వెళ్తుండగా మార్గ మధ్యలో కొత్తగట్టు వద్ద బైక్ అదుపు తప్పి ఒకసారిగా కింద పడడంతో తలకు, మోకాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి.

⇨ శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ముద్దమల్ల హరీస్ (23) లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు.

⇨ శంకరపట్నం మండలం తాడికల్ శివారులో ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

⇨ శంకరపట్నం మండలం తాడికల్ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి.

⇨ తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన 8మంది ట్రాలీ ఆటోలో వేములవాడ దైవ దర్శనానికి బయలుదేరారు. ఈ క్రమంలో వంకాయగూడెం వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీ ఆటో ట్రాలీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న ఆనంద్‌వర్ధన్, సూర్యప్రకాష్, ఇషాని ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు.

⇨ శంకరపట్నం మండలంలోని మక్త గ్రామానికి చెందిన పంచకోటి గోపి (30) బైక్‌పైన వంకాయగూడెం గ్రామ శివారులోని ఓ హోటల్‌కు వెళ్లి సర్వపిండి తీసుకొని బైక్‌పై తన హార్వేస్టర్ రిపేర్ షాపు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా హుజూరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీ కొట్టడంతో గోపి తలకు తీవ్రమైన గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు.

# ఎప్పటికి పూర్తయ్యేనో..?

- అసంపూర్తిగా అదనపు తరగతి గదులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తి కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేటు స్థాయిలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టినా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో శిథిలమైన తరగతి గదుల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది.



నిలిచిపోయిన తరగతి గదుల భవన నిర్మాణం

### ● నిలిచిన నిర్మాణాలు..

మండలంలోని రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, సింగారం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకం కింద ఎంపిక చేసి అభివృద్ధి పనులకు రూ.కోటి 57 లక్షల నిధులను కేటాయించింది. రెండేళ్ల కిందట పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. పాత భవనాలను తొలగించి అదే స్థలంలో పనులను చేపట్టారు. అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, సింగారం గ్రామాల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. మంజూరైన నిధుల్లో రూ.61 లక్షలు చెల్లించగా, మిగతా రూ.21లక్షలు చెల్లించాల్సి ఉంది. రాచర్లబొప్పాపూర్‌లో రూ.49.96, నారాయణపూర్‌లో రూ.26 లక్షలు కలిపి మొత్తం రూ.75.96లక్షలు చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు అర్ధంతరంగా పనులను నిలిపివేశారు.

### ● నిర్మాణాలు నిలిచిపోయాయి.

బిల్లులు రాకపోవడంతో పనులను నిలిపివేశారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం పేరిట అదనపు తరగతి గదుల నిర్మాణాలను చేపట్టింది. గత ప్రభుత్వంలో చేపట్టిన తరగతి గదుల నిర్మాణాలకు బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదు. రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 445 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒకే గదిలో ల్యాబ్, గ్రంథాలయం, డెస్క్‌లు ఉండగా, తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. ఇరుకు గదిలో పాఠాలు వినేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడం వల్ల పందులు, కుక్కలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ప్రయోగాలు చేయలేకపోతున్నాం..

- అల్లె ప్రణతి, 9వ తరగతి విద్యార్థిని, రాచర్లబొప్పాపూర్



పాఠశాలలో పాత తరగతి గదులను తొలగించి నిర్మాణ పనులను చేపట్టారు. యేడాది దాటినా పనులు పూర్తి కాలేవు. గదులు లేక ల్యాబ్ మూలకు పడింది. ప్రయోగాలు చేయలేకపోతున్నాం. అధికారులు స్పందించి తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలి.

### ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

- కృష్ణహరి, ఎంఈవో



గత ప్రభుత్వం 'మన ఊరు- మన బడి' కింద రెండేళ్ల తరగతి గదులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించింది. రాచర్లబొప్పా పూర్, నారాయణపూర్ గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయేలా చర్యలు చేపడుతాం.

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

● ముగ్గురి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆటో, ద్విచక్రవాహనం ఆదివారం రాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మండలంలోని నారాయణపూర్, హరిదాస్‌నగర్ గ్రామాలకు చెందిన యువకులు హఫీజ్, అఫ్రోజ్, రఘుపతితో పాటు మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. రంజాన్ పండుగ సందర్భంగా నూతన దుస్తులు కొనుగోలు చేసేందుకు హఫీజ్, అఫ్రోజ్‌లు కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వైపునకు వెళుతున్నారు. రఘుపతితో పాటు మరో ముగ్గురు ఆటోలో సిరిసిల్ల నుంచి హరిదాస్‌నగర్‌కు వస్తున్న క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి.

దీంతో హఫీజ్, అఫ్రోజ్, రఘుపతి పరిస్థితి విషమంగా ఉంది. హఫీజ్, అఫ్రోజ్‌ను ఎల్లారెడ్డిపేటకు, రఘుపతితో పాటు మరో ఇద్దరిని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రహదారిపై ఉన్న వాహనాలను తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాలప్రకారం కేసన్నపల్లె గ్రామానికి చెందిన వడిజె అఖిల్ ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవన్యూ శాఖ అధికారులు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## వైభవంగా ఉగాది వేడుకలు

● ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు



ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గుపూజారులు

ఓదెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వస్తిశ్రీ విశ్వావసునామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు, పారాయణాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున వచ్చిన వాహనాలకు పూజలు నిర్వహించారు. గతంలో నిర్వహించిన ఎడ్లబండ్ల ప్రదక్షిణలు కనబడలేదు. వాటి స్థానంలో వాహనాలకే రథాలను తయారుచేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. హరిపురం గ్రామానికి చెందిన యాదవ భక్తులు మేకల బండ్లతో ప్రత్యేక ప్రదక్షిణలు నిర్వహించారు. జమ్మికుంట, సుల్తానాబాద్, మంచిర్యాల, మందమర్రితో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులను సమర్పించారు. అలాగే పొత్కపల్లిలో రాజగోపాలస్వామి, భవాని సహిత మహా లింగేశ్వర స్వామి, మడకలో ఉమామహేశ్వర స్వామి, కనగర్తిలో శివాలయం, ఆంజనేయస్వామి, కొలనూర్ లో మల్లన్న గుట్ట వద్ద ఉగాది వేడుకలు, వాహనాల పూజలు నిర్వహించారు. అనంతరం మల్లన్న జాతరతోపాటు ఓదెల సీతారామచంద్రస్వామి, శివాలయం అలాగే గుంపుల రామభద్ర ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు భక్తి శ్రద్ధలతో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఇళ్ళ ముంగిట మహిళలు రంగవల్లులతో వాకిళ్లను అలంకరించి, పచ్చని తోరణాలతో ఉగాది వైభవాన్ని చాటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఏఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో పొత్కపల్లి పోలీస్ సిబ్బంది బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఉగాది వేడుకలకు దాదాపు 15 వేల మంది భక్తులు హాజరయ్యారు.



ఓదెల ఆలయంలో మేకలబండ్లతో భక్తుల ప్రదక్షిణలు

## నూతన కోర్సులతో ఐటీఐకి పూర్వ వైభవం

- టాటా వారి సహకారంతో ఏటీసీ సెంటర్ ఏర్పాటు
- 60వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ



పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల




ప్రభుత్వ ఏటీసీ సెంటర్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం గత వైభవాన్ని సంతరించుకుంటోంది. 59 ఏళ్లు పూర్తిచేసుకుని 60వ యేట అడుగుపెడుతున్న ఈ ఐటీఐ ఉత్తర తెలంగాణకు ఒక ఎంప్లాయిమెంట్ కేంద్రంగా కీర్తి గడిచింది. కోల్‌బెల్ట్, ఎన్టీపీసీ, నాటి ఎఫ్‌సీఐ ఎరువుల కర్మగారానికి, రామగుండం థర్మల్ పవర్‌స్టేషన్‌లకు టెక్నికల్ ఉద్యోగులను అందించింది.

1964లో పెద్దపల్లిలో ప్రారంభమైన ఈ ఐటీఐకి టెక్నికల్ విద్యనభ్యసించే వారికి ఒక వరం ఉండేది. మొదట ఫిట్టర్, టర్నల్, మిషినిస్ట్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆర్ అండ్ టీవీలకే పరిమితమైంది. ప్రస్తుతం ఈ ఐటీఐ అధునాతన కోర్సులకు స్వాగతం పలికింది. 20 ఎకరాల రెండు గుంటల్లో ఐటీఐ విస్తరించి ఉంది. ఇందులోనే జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం కూడా ఉంది. గతంలో కలెక్ట రేట్ ఉంటే దానిని సొంత భవనంలోకి మార్చారు.

### ● 646 మంది విద్యార్థులు

ఐటీఐలో ఎలక్ట్రిషన్ ఐదు యూనిట్లు, ఫిట్టర్ ట్రేడ్ రెండు యూనిట్లు, టర్నర్, మిషన్ ట్రేడ్, మోటార్ మెకానిక్ ట్రేడ్, వెల్డర్, కోపా, ఎలక్ట్రానిక్, డిజిల్ మెకానిక్ ట్రేడ్ రెండు యూనిట్ల చొప్పున నడుస్తున్నాయి. ఒక్కొక్క యూనిట్లో 20 నుంచి 22 మంది విద్యార్థులు ఉంటారు. విశాలమైన ప్రాక్టికల్ రూములు డ్రిల్ మిషన్స్ లేత్ మిషన్స్, గ్రైండింగ్ మిషన్స్ తదితర మిషన్‌లు అందుబాటులో ఉన్నాయి.



తరగతి గదిలో విద్యార్థులు

**ఏటీసీ సెంటర్లో కొత్త కోర్సులు**

పెద్దపల్లి ఐటీఐలో కొత్తగా నిర్మాణం చేసిన ఏటీసీ సెంటర్లో కొత్త కోర్సులు వచ్చాయి. అడ్వాన్స్‌డ్ సీఎస్‌సీ, అడ్వాన్స్‌డ్ టూల్ యూసింగ్ తోపాటు బేసిక్ డిజైనర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్స్ మొదలగు కొత్త కోర్సులు వచ్చినట్టు పేర్కొన్నారు.

### ● ఏటీసీ సెంటర్ నిర్మాణం

టాటా కంపెనీ వారు రూ.475 కోట్ల ఎస్టిమేషన్‌తో ఇక్కడ ఏటీసీ (అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్) నిర్మాణంతోపాటు దాన్ని నడిపించడానికి సిబ్బందిని నియమించారు. దీనిలో భాగంగా రూ.4.5 కోట్లతో ఏటీసీ భవన నిర్మాణం జరిగి రూ.33.5 కోట్లతో మిషన్ల ఏర్పాటు చేస్తున్నారు. దీనితోపాటు ముగ్గురు మాస్టర్లను కంపెనీ నియమించింది. ఏటీసీ సెంటర్‌కు 85 శాతం పెట్టుబడి టాటా కాగా, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.14 లక్షలు కలెక్టర్ కేటాయించారు. ఏటీసీ సెంటర్‌లో ఆరు ట్రేడ్‌లు మూడు యూనిట్లను ఏర్పాటుచేశారు. రెండు సంవత్సరాల కోర్సులు ఒక సంవత్సరం కోర్సు కూడా ఉంది. అలాగే కలెక్టర్ కోయ శ్రీహర్ష ఐదు లక్షలు రా మెటీరియల్ సమకూర్చడంతోపాటు డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు.

### ● జిల్లాలో ఆరు ప్రైవేటు ఐటీఐలు వెయ్యి మంది విద్యార్థులు

జిల్లాలో రెండు ప్రభుత్వ ఐటీఐలతోపాటు ఆరు ప్రయివేటు ఐటీఐలు కూడా నడుస్తు న్నాయి. పెద్దపల్లిలో సింధూర, కాకతీయ, శివ సాయి ఐటీఐలు ఉండగా, గోదావరిఖని ప్రాంతంలో గౌతమి, శివశక్తి, సారథి ఐటీఐ ఉన్నాయి. వీటిలో సంవత్సరానికి వెయ్యి మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

### ● అభివృద్ధి.. సమస్యలు

పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో యేటా అప్రెంటీస్‌షిప్ నిర్వహిస్తున్నామని, ప్రతీసారి 200 మందికి అప్రెంటీస్‌షిప్ అందించి జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మధ్యనే 100 మందికి జాబ్ మేళాలో జాబ్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. రెండు వైపులా గేట్ల నిర్మాణం చేపట్టి వాకింగ్ ట్రాక్‌తో మైదానం కళకళ లాడుతుందన్నారు. కాంపౌండ్ వాళ్ళ ఒకచోట కూలిందని దాని నిర్మాణం తో పాటు రూ.14 లక్షల విద్యుత్ బకాయిలను చెల్లించాల్సి ఉందని అన్నారు.

### ● నూతన ట్రేడ్‌లకు అనుగుణంగా స్టాఫ్‌ను పెంచాలి

నూతన ఏటీసీ సెంటర్‌లో ఉన్న కొత్త ట్రేడ్లకు అనుగుణంగా స్టాఫ్‌ను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న స్టాఫ్ 50 ఏళ్ళ పైబడిన వారే ఉన్నారు. వారిలో కొందరు సీటీఐ చేసిన వారు, మరి కొందరు డిప్లమా, కొంత అవుట్ సోర్సింగ్ ద్వారా వచ్చిన వారు ఉన్నారు. ఏటీసీ సెంటర్‌లో వచ్చిన కొత్త కోర్సులకు అనుగుణంగా బీటెక్, ఏటీఐ, సీటీఐ నుంచి టెక్నికల్ స్టాఫ్ వస్తేనే న్యాయం జరుగుతుంది.

### ఐటీఐ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

– వెంకటరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్, పెద్దపల్లి



పెద్దపల్లి ఐటీఐలో అందిస్తున్న కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న నూతన కోర్సులపై అవగాహన పెంచుకొని కోర్సులో చేరి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి.

# వేములవాడలో ఘనంగా ఉగాది వేడుకలు

● స్వామి వారికి ప్రత్యేక పూజలు ● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



వేములవాడలో కన్నుల పండువగా స్వామివారి రథోత్సవం



శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు రాజరాజేశ్వరస్వామి వారితో పాటుగా అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేక పూజలు చేశారు. నూతన పంచాంగ పుస్తకాలను స్వామి వారి చెంతవుంచి పూజలు నిర్వహించారు. రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయ పరిసరాలను పూలతో అందంగా అలంకరించారు.

● **భక్తుల రద్దీ..**

ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు లక్ష్మీగణపతి, రాజన్నను, పార్వతీదేవి అమ్మవారిని దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో అనంతపద్మనాభస్వామి, సీతారామచంద్రస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు.

● **వైభవంగా స్వామివారి రథోత్సవం..**

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను అంబారి సేవపై పట్టణ వీధులగుండా ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

**కొండగట్టులో..**

**మల్యాల:** కొండగట్టు అంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి చందనలంకారం, అభిషేకాలను ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. ఆలయ అధికారులు దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. వెంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు.

**ఆదివరాహస్వామి సన్నిధిలో..**

**కమాన్‌పూర్:** మండల కేంద్రంలోని ఆదివరహస్వామి సన్నిధిలో ఆదివారం ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి పూజలు చేశారు. వాహనదారులు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఆచార్యులు కలకుంట్ల వరప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. కమాన్‌పూర్ పిరమిడ్ స్వచ్ఛంద సంస్థవారు భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా టూటౌన్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐలు కె.ప్రసాదరావు, రవళి, ఏఎస్ఐ బాలజీ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, ఆర్జీ 2 జీఎం సుధాకర్‌రావు, యుాట్యూబర్ వర్షిని, ముత్యాల దామోదర్, ఇనుగంటి రామారావు, కిషన్‌రెడ్డి తదితరులు ఉగాది ఉత్సవాలలో పాల్గొన్నారు.

**ధర్మపురిలో భక్తుల పూజలు..**

**ధర్మపురి:** లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ దేవాలయాల్లో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచియే పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతిధ్వనించాయి. రాత్రి వరకు భక్తులతో ఆలయాల్లో రద్దీ నెలకొంది.



కమాన్‌పూర్: ఆదివరాహస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

## ధర్మపురి, కొండగట్టులో ఘనంగా పంచాంగ శ్రవణం



కొండగట్టులో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి దేవాలయం ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను శేషప్ప కళా వేదికపై తీసుకువచ్చారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేకపూజలు జరిపారు. ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్య పండితులు బుగ్గారపు రాజేంద్రప్రసాద్‌శర్మ నూతన శ్రీ విశ్వావసునామ సంవత్సర పంచాంగం పఠించారు. ఏడాదిలో రాశులకు సంబంధించిన ఆదాయ, ధన, వ్యయ, అధికారం, రాజయోగంతోపాటు ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, పంటలు, ఫలాల గురించి వివరించారు. జ్యోతిష్యపండితులు బుగ్గారపు రాజేంద్రప్రసాద్‌శర్మను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు ఒజ్జల సౌజన్య, బాదినేని వెంకటేష్, రాపర్తి సాయికుమార్, గుడ్ల రవీందర్, నేదునూరి శ్రీధర్, బొల్లారపు పోచయ్య, స్తంభంకాడి గణేష్, మందుల మల్లేష్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పాల్గొన్నారు.

**కొండగట్టులో..**

**మల్యాల:** కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్ పంచాంగశ్రవణం చేయగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నివేదన కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్ రావు, ప్రధానార్చకులు రామకృష్ణ, రఘు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఆలయఅర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం కొండపైన రూ.35 లక్షలతో చేపడుతున్న జీఐ షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యం భూమి పూజ చేశారు.



ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలయ చైర్మన్, ఆలయ ఈవో, ప్రముఖులు, భక్తులు

## తాగునీటి కోసం పోచమ్మతండా వాసుల ఆందోళన



బిందెలు, డ్రమ్ములు, బకెట్లతో ఆందోళన చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మతండా గిరిజన మహిళలు ఆదివారం తాగునీటి కోసం ఆందోళన చేశారు. తండాలో 16 కుటుంబాలు జీవిస్తున్నాయని, తాగేందుకు నీటికి తల్లాడిల్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చుక్కనీరు లేక పండుగ పూట పనులు చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. పదిహేను రోజులనుంచి తండాలో తాగునీటికి ఇబ్బం దులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలను ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.

## బీర్‌పూర్‌లో ఎడ్లబండ్ల పోటీలు



ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

బీర్‌పూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఎడ్లబండ్ల పోటీలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, సారంగాపూర్ మాజీసర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి, గోణె రమణ రావ్, మాజీ ఉపసర్పంచ్ హరీష్, కృష్ణరావ్, నేరెల్ల సుమన్, శ్రీనివాస్, రాజేశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పంటలను కాపాడాలని అంజన్నకు ముడుపు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సాగుచేసిన పంటలను కాపాడాలని వేడుకుంటూ ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో రైతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు వేణుగోపాలచారి ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. వడగళ్ల వానలు కురవకుండా పంటలను రక్షించాలని ముడుపు వేశారు. ప్రతి యేటా ఉగాది పండుగ రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు వేయడం అనాదిగా వస్తున్న ఆచారమని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హన్మండ్లు, మాజీ సర్పంచులు నర్సయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు మల్లారెడ్డి, నర్సయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల సందర్శనలు... పంచాంగ శ్రవణాలు

● వైభవంగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు
● పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు



గౌరెడ్డిపేట జీల్గుల మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

పెద్దపల్లి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ): విశ్వావసు నామ సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పలు గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. పెద్దకల్వల, కొత్తపల్లి, రాగినేడు, పాలితం, నిమ్మనపల్లి, అప్పన్నపేట, రాఘవపూర్, గౌరెడ్డిపేట, హన్మంతునిపేట, భోజన్నపేట, నిట్టూరు గ్రామాలతోపాటు పలు ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దకల్వల క్యాంపులో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అర్చకులు భాష్యం రంగాచార్యులు పంచాంగ శ్రవణం వినిపించగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, ఉద్యోగుల సంఘం నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు ఉగాది పచ్చడి, భక్షాలు పంపిణీ చేశారు. పర్వతాల మల్లిఖార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు స్వామివారిని దర్శించుకొని ఆలయం చుట్టూ వాహనాలు, ఎడ్లబండ్లతో తిరిగి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంకాలం మహిళలు ఇంటి నుంచి బోనం ఎత్తుకొని ఒగ్గు డోలు కళాకారుల నడుమ ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించారు. గౌరెడ్డిపేటలోని జీల్గుల మల్లిఖార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిట్టూరులోని కోదండ రామాలయంలో ఆలయ అర్చకులు శ్రీమాన్, కొండపాక పెద్దవెంకటాచార్యులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకాలు, టీటీడీ శ్రీవారి కల్యాణ అక్షింతలు, కంకణాలు ఎంపిణీ చేశారు.

**మంథని, (ఆంధ్రజ్యోతి):** విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను డివిజన్‌లోని ప్రజలంతా ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచులు కలిగిన ఉగాది పచ్చడిని, బూరెలను ఆరగించారు. జాతక ఫలాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు వేద పండితులు నిర్వహించిన పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు. ఉగాది సందర్భంగా పలు చోట్ల కవి సమ్మేళాలు జరిగాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పండగ శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజలు వారి నివాసంలో ఉగాది పచ్చడిని అందజేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మహాగణపతి, మహాలక్ష్మీ, లక్ష్మీనారాయణ, గౌతమేశ్వర, శీలేశ్వర-సిద్దేశ్వర, ఓంకారేశ్వర, భిక్షేశ్వర, హనుమాన్, అయ్యప్పస్వామి, కన్యకాపరమేశ్వర, మహాసరస్వతి, రామాఅంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితులు పంచాంగ శ్రవణాన్ని వినిపించారు.

**మంథని రూరల్:** ప్రజలు ఉగాది వేడుకలను జరుపుకున్నారు. గాజులపల్లి సంతాన నాగేంద్ర స్వామి ఆలయం, గుంజపడుగులోని మిట్టమల్లికార్జునస్వామి, దేవస్థానంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి స్వామిని దర్శించుకొని బోనాలను సమర్పించారు. యాదవ కులస్థులు పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

## పెద్దాపూర్‌లో ఎడ్లబండ్ల పోటీలు



పెద్దాపూర్ ఆలయం ప్రాంగణంలో ఎడ్లబండ్ల పోటీలు

జూలపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామస్థులు ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పోటీల్లో రైతులు పాల్గొని ప్రతిభను కనబరిచారు. ఈ వేడుకలను చూసేందుకు పెద్దసంఖ్యలో రైతులు, ప్రజలు తరలివచ్చారు. ఎడ్లబండ్ల పోటీలు జరుగుతుండగా ప్రజల చప్పట్లతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. విజేతలకు బహుమతులను అందజేశారు.

**జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి):** ఉగాది పర్వదినాన్ని ఎన్టీపీసీ ఏరియాలో ఘనంగా నిర్వహించారు. చిలుకలయ్య గుడి, పీటీఎస్ వెంకటేశ్వరాలయం, హనుమాన్ ఆలయాలలో ఉగాది సందర్భంగా భక్తులు పూజలు చేశారు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద భగవతి యూత్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. యూత్ అధ్యక్షుడు రవిగౌడ్, బుద్దె సతీష్, వొల్లాల సురేష్, మామిడాల చంద్రయ్య, ఆడెపు పరంధాములు, పెట్టెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**జూలపల్లి (ఆంధ్రజ్యోతి):** మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. రైతులు, వ్యాపారులు కొత్తపనులకు శ్రీకారం చుట్టారు. పలు ఆలయాల్లో వేదపండితులచే పంచాంగ శ్రవణం చేశారు. ఆయా రాశుల వారికి జన్మనక్షత్ర ఫలితాలు,శుభాలు, ఆదాయ,వ్యయాలు వివరించారు.

**సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి):** సుల్తానాబాద్‌లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వేణుగోపాలస్వామి, పాత బజార్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో సాయంత్రం పంచాంగ శ్రవణంలో అర్చకులు సౌమిత్రి శ్రావణ్ కుమార్, పారువెళ్ల రమేష్ శర్మలు ద్వాదశ రాశుల గోచార ఫలితాలు వివరించారు. వనితా క్వీన్స్ క్లబ్ అధ్యక్షురాలు పల్లా సౌమ్య తదితరులు భక్తులకు పచ్చడి పంపిణీ చేయగా, పల్లా కిషన్ రాజమణి, మహేందర్ సుమ దంపతులు భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పంచాంగ శ్రవణంలో ఆలయ చైర్మన్ పల్లా మురళి సదాలక్ష్మి, పల్లా శరత్, గజభీంకార్ జగన్, తదితరులు పాల్గొన్నారు. శివాలయంలో వల్లంకొండ మహేష్, రమేష్‌లు పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ భాగ్యలక్ష్మి, మాదూరి ప్రసాద్, మారుతి రమేష్ పాల్గొన్నారు.

**ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలు ఆలయాల్లో ఉగాది పర్వదినం పురస్కరించుకుని పండితులు పంచాంగ శ్రవణం చేశారు. సుల్తాన్‌పూర్‌లోని హన్మాన్ ఆలయం, ముప్పిరితోట వెంకటేశ్వరస్వామి, ఎలిగేడు శివాలయం, సీతారామ ఆలయాల్లో, పురోహితులు పంచాంగం చదివి ప్రజలకు వివరించారు. ఉగాది పచ్చడిని అందించారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు తానిపర్తి శ్రవంతి మోహన్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, మండిగ రాయనర్సు నరహరి సుదాకర్‌రెడ్డి, పెద్దపల్లి దేవరాజు, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

**పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి):** విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని పలు పార్టీల నాయకులు ఆకాంక్షించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం మండలం పరిధిలోని పలు ఆలయాల్లో పురోహితులు పంచాంగ పఠనం నిర్వహించారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. రైతులు పలు గ్రామాల్లో వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు చేసి ఏరువాక పనులను ప్రారంభించారు. ఒకరికి ఒకరు ఉగాది శుభాకాంక్షలను తెలుపుకున్నారు. ఈసాలతక్కళ్లపల్లిలో మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షుడు రాజయ్య పటేల్ ఆధ్యక్షతన వేడుకలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, మండల అధికార ప్రతినిధి కొమురయ్య, పాల్గొన్నారు.



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌దంపతులు

**కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి):** తెలుగు నామ నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలీ దంపతులు అన్నారు. గోదావరిఖని చౌరస్తాలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది పచ్చడి, భక్షాల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలో రామగుండం ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఏసీపీ రమేష్, వీహెచ్‌పీ అయోధ్య రవీందర్, బల్మూరి అమరేందర్‌రావు, సంజయ్ కుమార్, ముష్కె సంపత్, అడిగొప్పుల రాజు, వెంకటస్వామి, పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి):** కాలనీవాసులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీలోని ఆలయాల్లో వేకువజాము నుండే భక్తులు బారులు తీరారు. సాయంత్రం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు పంచాగశ్రవణం, పూజలు చేశారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వితరణ చేశారు. అయ్యప్ప దేవాలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు జరిగాయి. అర్చకులు పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

**కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి):** మండలంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ గ్రామాన పంచాంగ శ్రవణం జరిగింది. పోచమ్మ తల్లికి కోళ్లతో కొబ్బరికాయలతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

### ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో

పెద్దపల్లి, (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వేద పండితులతో నూతన పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఉగాది పచ్చడిని, ఉగాది బక్షాలను అందజేసి నియోజకవర్గ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అర్చకులు కొండపాక శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన పోచమ్మ ఆలయాలు



పోచమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కళ్యాణ్‌నగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా పోచమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధాన చౌరస్తా, బాపూజీనగర్, తిలక్‌నగర్, విఠల్ నగర్, ఐబీ కాలనీ, గంగానగర్, చంద్రబాబు కాలనీ ల్లోని పోచమ్మ ఆలయాల్లో తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పలుకాలనీల నుంచి భక్తులు బోనం నెత్తిన పెట్టుకుని ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు.





మంథనిలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నివాసంలో ఉగాది వేడుక, ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌లో పంచాంగ శ్రవణం

### కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గోదావరిఖని, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎస్సీ మోర్చ జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం జీఎం కాలనీలో నిర్వహించిన మన్‌కీ బాత్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు. బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి, మామిడి వీరేశం పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు వెంకట్రావ్‌పల్లె మాజీ ఎంపీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాన్ని రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని నిరసిస్తూ రాజీనామా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. గ్రామ ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్షంగా కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని ఖండిస్తున్నట్టు పేర్కొ న్నారు. మంత్రిగా శ్రీధర్‌బాబు గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేయడానికి మద్దతు తెలపడం సరికాదని భావిస్తూ రాజీనామా చేస్తున్నట్టు బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు..

### క్యాంపు కార్యాలయంలో పంచాంగ శ్రవణం

గోదావరిఖని, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా ఆదివారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉగాది పంచాంగ శ్రవణాన్ని కాశీవిశ్వేశ్వర ఆలయ పురోహితులు ఒజ్జల వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. గత ఏడాది చేదు గుర్తులను వదిలి ఈ ఏడాది తీపి గుర్తులతో ముందుకు వెళ్లాలని, రామగుండం అభివృద్ధి పథంలోకి దూసుకెళుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, రాజలింగం, గట్ల రమేష్, అజయ్‌సింగ్ పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ

రామగిరి, మార్చి 30(ఆంధ్ర జ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలో డ్రిల్ ఆపరేటర్‌గా పనిచేసే ఎలువాక జగదీష్ అనే కార్మికుడు మండలంలోని కల్వచర్ల గ్రామంలోని నిరుపేద కుటుంబానికి నిత్యావసర వస్తువులను అందజేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సింగరేణి యువబలగం ఆధ్వర్యంలో కొమురమ్మకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేపట్టారు. సభ్యులు మేకల మారుతి, గొట్టిముక్కుల మల్లేష్‌గౌడ్, ఆనంరాజు, బూడిద రాజేందర్, తంగళ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో రౌడీషీటర్ల హల్‌చల్

పాయిరాల శ్రీకాంత్ శవయాత్రలో గొడవకు యత్నం ● పోలీసుల లాఠీచార్జ్

కోల్‌సిటీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఫైవింక్లయిన్‌లో శనివారం రాత్రి కొందరు రౌడీషీటర్లు హల్‌చల్ చేశారు. రౌడీషీటర్ పాయిరాల శ్రీకాంత్ సిద్ధిపేట సమీపంలోని శనిగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని మరణ వార్తతో గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, బేగంపేట ప్రాంతానికి చెందిన అతని స్నేహితులు, మాజీ నేరస్థులు, రౌడీషీటర్లు పెద్దఎత్తున గోదావరిఖని ఫైవింక్లయిన్‌కు వచ్చారు. అతడి మృతికి సంబంధించి రాజీ విషయంలో ఆలస్యం కావడంతో రౌడీషీటర్లు మద్యం సేవించారు. ఫైవింక్లయిన్ సెంటర్‌లో మద్యం షాపుల వద్ద గొడవకు దిగారు. అంత్యక్రియల ఊరేగింపులో మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. బేగంపేటకు చెందిన ఇద్దరు మాజీ నేరస్థులు గొడవలకు కారణమైనట్లు తెలుస్తున్నది. పోలీసులు చాలా సేపు సంయమనం పాటించారు. చివరికి బ్లూకోల్ట్స్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు లాఠీలకు పని చెప్పారు. సీపీ ఆదేశాలతో పోలీసులు కొన్ని రోజులుగా రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టారు. రౌడీ షీటర్లను, సస్పెక్ట్ షీటర్లను బైండోవర్ చేశారు.

**సోషల్‌మీడియా గ్రూపుతో రౌడీషీటర్ల ఆర్గనైజ్**

రామగుండం ప్రాంతంలో రౌడీషీటర్లు పలు హత్యల్లో భాగస్వామ్యం అయ్యారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఠాణాల్లో వీరిపై రౌడీషీట్లు నమోదయ్యాయి. కొందరు రౌడీషీటర్లు సోషల్ మీడియా ద్వారా ఆర్గనైజర్ అవుతున్నట్టు తెలుస్తుంది. స్థానికంగా కొంత స్తబ్ధతగా ఉంటూ మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి ప్రాంతాల్లో భూ వివాదాలు, ఇతర సెటిల్‌మెంట్లు చేస్తున్నట్టు చర్చ జరుగుతుంది. రెండేళ్ల క్రితం గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో రౌడీషీటర్ మంథని సుమన్ హత్య జరిగిన తరువాత అంత్యక్రియల ఊరేగింపులో కూడా రౌడీషీటర్లు పెద్ద ఎత్తున పాల్గొని రెచ్చగొట్టే నినాదాలు చేయడం, తల్వార్లు తిప్పడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. పోలీస్ మార్క్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ శ్రీకాంత్ అంత్యక్రియల్లో రౌడీషీటర్లు మద్యం మత్తులో గొడవలకు దిగడం చర్చనీయాంశమైంది.

## రంజాన్ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే





ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విజయరమణారావు

కళ్యాణ్‌నగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినం సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఫైవింక్లయిన్ ఈద్గాలను ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈద్గాల వద్ద షామినియాలు, మ్యాట్లు ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. నమాజ్ సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. ముస్లిం మైనార్టీ నాయకులు ఎండీ ముస్తాఫా, ఫజల్ బేగ్, నజీమొద్దీన్, యాకూబ్, గఫూర్ ఉన్నారు.

### ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

పెద్దపల్లి, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతు ముస్లింలకు ముందస్తు గా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. తహసీల్దార్ రాజయ్య ఆర్ఐ లు మైనారిటీ నేతలు మత పెద్దలు నాయకులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలకు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, బీఆర్ఎస్ నాయకులు నిదానపురం దేవయ్య, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులు 'వొజ్జల'కు ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారంతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్

కోల్‌సిటీటౌన్/కళ్యాణ్‌నగర్ మార్చి 30(ఆంధ్రజ్యోతి): మూడున్నరేళ్లుగా గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీలోని కాశీవిశ్వేశ్వర ఆలయం ప్రధాన అర్చకులుగా సేవలందిస్తూ పంచాంగ శ్రవణం చెపుతున్న వొజ్జల వెంకటేశ్వరశర్మకు ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతకుమారి చేతుల మీదుగా వెంకటేశ్వరశర్మ రూ.10,116 ప్రోత్సాహకంతో పాటు ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. వెంకటేశ్వరశర్మ ఉగాది పురస్కారం అందుకోవడం పట్ల గోదావరిఖనికి చెందిన అర్చకులు అభినందనలు తెలిపారు.ఈ అవార్డు రావడం పట్ల నాయకులు మహంకాళి స్వామి, గడ్డం శ్రీనివాస్, అర్చకులు అభినందించారు.

## నాగేపల్లి మాజీ సర్పంచ్‌కు సన్మానం



రామగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్‌ను అఖిల భారత యాదవ కమిటీ ఆధ్వర్యంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. గ్రామాన్ని సమగ్రాభివృద్దిలో నడిపించి, కరోనా కష్టం కాలంలో చేసిన సేవలకు గాను మాజీ సర్పంచ్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశంయాదవ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు గిరవేణ రామన్న సన్మానించారు.

### తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి మెడికల్ కళాశాలలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కాంట్రాక్టర్ తరుణ్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ సోమవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, స్కావెంజర్లకు జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని, దీనిపై పలు మార్లు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుకు వినతి పత్రం ఇచ్చినా స్పందించడం లేదన్నారు. కార్మికులను శ్రమ, ఆర్థిక దోపిడీకి గురి చేస్తూ నెలకు రూ.11వేలు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని, రూ.4500 కోత విధిస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు న్యాయంగా రావాల్సిన హక్కులు కల్పించడం లేదని, ప్లేడే చేస్తే రెస్ట్, డబుల్ డ్యూటీ ఇవ్వడం లేదని, పండుగ అడ్వాన్స్‌లు, బోనస్‌లు ఇవ్వకుండా వేధిస్తున్నారని, ప్రశ్నించిన వారిని ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా ఒక అధికారిని నియమించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరారు.

### అంబేద్కర్ విగ్రహాలను తొలగిస్తే సహించం

కోల్‌సిటీటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో కుట్ర పూరితంగానే బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను రామగుండం కార్పొరేషన్ అధికారులు తొలగించేందుకు కుట్రపన్నుతున్నారని, అంబేద్కర్ విగ్రహాలను తొలగిస్తే సహించేది లేదని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయకార్యదర్శి కొంకటి లక్ష్మణ్ ఆరోపించారు. ఆదివారం గోదావరిఖనిలో జరిగిన మహాత్మాజ్యోతిరావుపూలే, అంబేద్కర్ జ్ఞాన మాల కార్యక్రమంలో భాగంగా పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కొందరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కులవివక్ష, కుట్రపూరితంగా దళిత వ్యతిరేకులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విగ్రహాలను తొలగిస్తే ఉద్యమిస్తామని అధికారులను హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీకమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ సిఫారసు మేరకు కలెక్టర్ విగ్రహాలు తొలగించమని హామీ ఇచ్చారన్నారు. మైసరాజేష్, కాంపెల్లి సతీష్, మంథెన లింగయ్య, బూడిద మహేందర్, పంజా అశోక్, పోగుల రంగయ్య, సమ్మయ్య, పాల్గొన్నారు.

### ఊరూరా జ్ఞానమాల కార్యక్రమం చేరాలి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఊరూరా అంబేద్కర్ ఆలోచన విధానం తెలియజేసేలా జ్ఞానమాల కార్యక్రమాన్ని చేరవేయాలని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ కందుకూరి రాజారత్నం పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన పూలె అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆకునూరి బాలంకుస్, సురేష్, అబ్దుల్ కరీం, చంద్రశేఖర్, ఆదినారాయణ, పోచయ్య, స్వామి, రాజ్‌కుమార్, స్వామి పాల్గొన్నారు.